# 'స్త్రీణాంచచిత్తం, పురుషస్యభాగ్యం'

ఆనందరావు అయిదుగంటలకు సరిగ్గా నిద్రనుంచి లేచి పడకపైన కూచున్నాడు. తన పాతికేళ్ళ జీవితంలో ఆనందరావు ఎప్పుడూ అయిదు గంటలకు నిద్రలేవలేదని చెప్పడానికి కూడా వీల్లేదు. కానీ అతడెప్పుడైనా లేచివుంటే అందుకు కారణాలు, ఒకటి - మునిసిపల్ పార్కులోని సైరను మ్రోత. రెండు - గదిలోని గడియారం అలారం మ్రోత.

బలవంతంగా తనను నిద్రాదేవత ఒడిలో నుంచీ, సర్వసంక్షోభాలకూ నిలయమైన ప్రపంచంలోకి లాగి తెచ్చినందుకు మునిసిపాలిటీ వారిని నిందించుకుంటూనో, అలారం పెట్టిన వాళ్ళని తూలనాడుకుంటూనో మళ్ళీ నిద్రపోయేవాడు ఆనందరావు.

కానీ ఏ రోజున్నయితే ఆనందరావు అయిదుగంటలకు నిద్రలేచి పడకపైన కూచున్నాడో ఆ రోజున సైరన్ మ్రోత కలకంఠి మంజుల గీతికగానూ, అలారం మ్రోత ఆత్మీయుడి అనురాగాలాపంగానూ అతడికి స్ఫురించింది.

అతడు హాయిగా గొంతెత్తి పాడుకోవాలనికూడా అనుకున్నాడు!

కానీ సమయానికి ఆనందరావుకు ఏపాటగానీ జ్ఞాపకం రాలేదు. ఐనా ఏనాడు నేర్చిన పాటలు! ఎప్పుడో పల్లెటూరి పాఠశాలలో పంతులమ్మ నేర్పించినవీ, తరువాత హైస్కూలు చదువుల్లో, పోస్టాఫీసు గుమాస్తా బ్రతుకులో పెదవులపై మెదల్లేక ఏ అజ్ఞాతసీమలకో వలసపోయినవీ, ఒకానొకనాటి సుప్రభాతాన ఆనందరావుకు తమతో పని కలుగవచ్చునని తెలియనివీ అయిన పాటల్ని మననం చేసుకోలేక, ఆనందరావు సన్నగా ఈలవేసుకోవడంతో తృప్తిపడిలేచి అద్దం ముందు నిలుచున్నాడు.

"నువ్వు ఊరికి పోబోయేది పన్నెండు గంటలకే కదరా బాబూ" అన్నది కడప దగ్గర చాపపైన పడుకున్న కామాక్షమ్మ లేచి కూచుంటూ. ఆనందరావు వాలకాన్ని బట్టి చూస్తే అతడు ఎనిమిది గంటల రైలుకే బయలుదేరేస్తాడేమోనన్న సందేహం కలిగిందామెకు!

తన ఆనందాన్ని తల్లి గమనించిందేమోనని ఆనందరావు కించపడుతూ "మనం ప్రోగ్రాం వేశామంటే, మళ్ళీ దాన్ని మార్చుకోవడమంటూ వుండనే వుండదు. నా ప్రయాణం కోసం నువ్వు లేనిపోని తొందర పెట్టుకోనక్కరలేదు, భోజనమైం తర్వాత వెళ్తాను" అన్నాడు.

కామాక్షమ్మ అంట్లు తోముకోడానికి పెరట్లోకి వెళ్ళింది. ఆనందరావు పురవీధుల్లో షికారు బయల్దేరాడు.

షికారుకు బయల్దేరడంతోటే ఆనందరావు ఆరోజుకోసం వేసుకున్న ప్రోగ్రాం కూడా ప్రారంభమైంది. ఏడువరకూ వాహ్యాళి. ఎనిమిదికి లాండ్రీకి వెళ్ళిరావడం. తొమ్మిదిగంటలప్పుడు ఆఫీసుకు వెళ్ళి తోడి గుమాస్తా దగ్గర సెలవు పుచ్చుకోవడం, పదికి భోజనం, పదకొండు గంటలకు సరిగ్గా రైల్వేస్టేషను, ఇదీ సంక్షిప్తంగా ఆనందరావు కార్యక్రమం.

పన్నెండు గంటలకు వచ్చే రైలుకోసం పదకొండు గంటలకే ఎందుకు స్టేషనుకు వెళ్ళాలి అని ఎవరైనా ప్రశ్నిస్తారేమోనని, ఆనందరావు ఆ ప్రశ్నకు సమాధానం ముందుగానే ఆలోచించుకున్నాడు. "వాన రావడం, ప్రాణం పోవడం ఎలా మానవుడి ఆధీనంలోలేవో, రైళ్ళ రాకపోకలుగూడా అలా మానవుడి నిర్ణయాలకు కట్టుబడి వుండవు. ఒక్కొక్కప్పుడు ఒక్కొక్క రైలు రెండు మూడు గంటలు ఆలస్యంగా కూడా వస్తుంది. అలాంటప్పుడు ఒక రైలు, ఒకరోజున ఒక గంట ముందుగా రాదని మాత్రం పూచీ ఏమిటి?"

కార్యక్రమం నిర్ణయించుకోవడంలో ఆనందరావెంత జాగ్రత్తగా వుంటాడో, దాన్ని పాటించడంలో మరింత మెలకువగా వుంటాడు. అందుకు నిదర్శనం అతడు టంచనుగా పదకొండుగంటలు గడియారంలో మ్రోగేసరికి స్టేషనులో వుండడమే!

స్టేషనులో అడుగుపెట్టీ పెట్టకముందే ఆనందరావు చేయి జేబులోకి పోయింది. వెంటనే భర్తీగా వున్న పర్సు పైకి వచ్చింది. అతడు బుకింగ్ రూము కిటికీ దగ్గర నిలబడి, ఒక అయిదు రూపాయలనోటు లోపలికి చాపి "నెల్లూరు, ఒక టికెట్ సార్" అన్నాడు.

నెల్లూరికి టికెట్టు యివ్వమని అడగడంలో ఆనందరావు కనబరచిన వినయాన్ని అవగతం చేసుకుని అతడికా టికెట్టు ప్రసాదించవలసిన బుకింగ్ క్లర్కు తారకరావు అప్పుడు తన స్వాధీనంలో లేడు. స్వాధీనంలో మాత్రం లేకపోవడమేమిటి, అతడప్పుడు భారతదేశంలోనే లేడు! కుర్చీలో కూచుని, టేబిల్‌పైకి కాళ్ళు చాపుకుని, చేతుల్లో దినపత్రిక వుంచుకుని అతడు అంతర్జాతీయ సమితిలో అమెరికా ప్రతినిధి ఉపన్యాసాన్ని శ్రద్ధగా వింటున్నాడు.

ఆనందరావుకు దినపత్రికలంటే బొత్తిగా సరిపడదు. అదేపనిగా వాటిని చదువుకుంటూ కూచునే వాళ్ళని చూస్తే అతడికి తగని చిరాకు. కానీ తన ఆగ్రహాన్ని ఎక్కడ చూపించవచ్చునో, ఎక్కడ చూపించగూడదో బాగా తెలిసిన ఆనందరావు, మళ్ళీ వీలైనంత వినయంగానే టికెట్టుకోసం అర్థించాడు. కానైతే, అతడీసారి బిగ్గరగా "టికెట్టుసార్ టికెట్టు, నెల్లూరికి" అని అరిచిన మాట మాత్రం వాస్తవం!

తారకరావు చేతుల్లోనుంచీ పేపరు క్రిందికి జారిపోయింది. అతడు ఆనందరావువైపు చూచాడు. కానీ అవేం చూపులు! తన ధ్యాననిష్ఠను భగ్నం చేసిన మేనకను విశ్వామిత్రుడు అలా చూచి వుంటాడు!

తనపైకి ప్రసరిస్తున్న తారకరావు చూపులకు అర్థమేమిటో తెలుసుకునేందుకు ఆనందరావు ప్రయత్నించలేదు. అతడు తన మామూలు ధోరణిలోనే "టికెట్టుసార్, నెల్లూరికి" అన్నాడు. డబ్బిచ్చి టిక్కెట్టు తీసుకోవడం ప్రయాణీకుడి హక్కనీ, మారుమాటాడకుండా దాన్ని యివ్వడం బుకింగ్ క్లర్కు బాధ్యతనీ ఆనందరావు ఉద్దేశం!

ఐతే బుకింగ్ క్లర్కు తారకరావు తన బాధ్యతని గుర్తించి, అందుకు తగ్గట్టుగా ప్రవర్తించే 'మంచి ఉద్యోగి'లా కనిపించలేదు ఆనందరావుకు!

"టికెట్టు యిప్పుడు యివ్వబడదు" అని ముక్తసరిగా సమాధానం చెప్పి తారకరావు మళ్ళీ పేపర్ని చేతికి తీసుకున్నాడు.

"ఏం? ఎందుకివ్వబడదు!" అని గద్దించాడు ఆనందరావు, తనకేదో అవమానం జరిగిపోయినట్టు భావించుకుని! ఐతే ఆనందరావు ఎంతోసేపు వేచివున్నా ఈ ప్రశ్నకు తారకరావు దగ్గరినుంచీ సమాధానం రాలేదు.

ఆనందరావుకు కోపం సాధారణంగా రాదు. కానీ వస్తే మాత్రం చొక్కా చేతులు పైకి తీసి ఎదుటివాడితో కుస్తీకి తలపడడం అతడికి పుట్టుకతో వచ్చిన గుణం. ఐనా కుస్తీ పట్టడానికి అభ్యంతరంగా తనకూ తారకరావుకూ మధ్య ఒక రాతిగోడ వుండడం వల్ల ఆనందరావు కొంచెం తమాయించుకుని "ఇక్కడ తమరు చేయవలసిన ఉద్యోగం పేపరు చదువుకోడం కాదని నా ఉద్దేశం. ఐతే మీ ఉద్యోగం పట్ల మీ అభిప్రాయమేమిటో నాకు తెలియదు. ఇక్కడ రైళ్ళు బయలుదేరడానికి రెండు గంటలు ముందునుంచీ టిక్కెట్టు యివ్వబడును' అని బోర్డు వ్రేలాడుతోంది. ఇది మరీ అంత చిన్న బోర్డు కాదు, కళ్ళకు కనబడకపోవడానికి! మరి... మరి...' అంటూ అర్ధోక్తితో నిలిపాడు.

"అక్కడ ఆ బోర్డు వ్రేలాడుతూనే వుంటుంది. ఇక్కడ మేము మా యిష్టం వచ్చినప్పుడే టికెట్లు యిస్తూవుంటాము" అన్నాడు తారకరావు పేపరు చూసుకుంటూనే! ఆనందరావు తోక ద్రొక్కిన త్రాచులా మండిపడుతూ కంప్లెయింట్స్ పుస్తకం కోసం స్టేషను మాస్టరు గది దగ్గరికు పరుగెత్తి, ఆ గది తలుపులు మూయబడివుండడం చూచి తెల్లమొగం వేసుకుని కాలుగాలిన పిల్లిలా వెయిటింగు రూంలో తచ్చాడసాగేడు.

తరువాత అరగంటకు రైలు అవుటయినందుకు గుర్తుగా గంట మ్రోగింది. ప్రయాణీకులు ఒక్కొక్కరుగా టిక్కెట్టు తీసుకోసాగారు. ఆనందరావు, మళ్ళీ బుకింగ్ రూమ్ కిటికీ దగ్గర నిలబడి తారకరావు ముఖాన్ని చూడ్డానికి మనస్కరించక డబ్బిచ్చి ఒక పెద్దమనిషి చేత టిక్కెట్టు తెప్పించుకున్నాడు.

ఐదు రోజులు తరువాత సంగతి.

ఆనందరావు ఆనాటి వుదయమే అత్తగారి వూరినుంచీ తిరిగివచ్చి ఆఫీసులో కూచుని ఏదో అకౌంట్స్ చూచుకుంటూ వుండగా కిటికీ దగ్గరనుంచీ ఎవరో పిలిచారు. ఎవరైనా స్టాంపులకోసం వచ్చారేమోనని ఆనందరావు తలెత్తి చూచాడు. అక్కడ టికెట్లు ఒక పట్టాన యివ్వకుండా రైలు ప్రయాణీకుల్ని ఏడిపించే తారకరావు నిలబడివున్నాడు!

గడచిన నాలుగైదు రోజులనుంచీ, అధికారమే గనుక తన చేతిలో వుంటే తారకరావుకు ఏయే శిక్షలు విధించవచ్చునో ఆలోచించుకున్న ఆనందరావు ఈసారి ఉడికించేవంతు తనదనుకుంటూ "ఎవరక్కడ? ఏం కావాలి?" అని ధీమాగా ప్రశ్నించాడు.

"ఆ ఏం లేదు సార్! నా కొకజాబు వచ్చి వుండాలి గుంటూరునుంచీ, కొంచెం దయచేసి దాన్ని..." అంటూ నసిగాడు తారకరావు.

"గుంటూరునుంచీ జాబా!" ఆనందరావు పైకిలేచి "ఇప్పుడు టైమెంత? తొమ్మిదిన్నరయింది. పోస్టుమేన్ ఊళ్ళో ఎక్కడో జాబుల్ని బట్వాడా చేస్తూ వెంటాడు. వెళ్ళి అతడ్ని పట్టుకోండి" అన్నాడు.

"ఇక్కడికీ స్టేషనుకూ రెండు మైళ్ళు దూరంకదండీ! పోస్టుమేన్ ఊళ్ళో తన పనంతా అయిన తర్వాత సాయంత్రం ఐదుగంటలకు కానీ ఆ వైపురాదు. ఇప్పుడు స్టేషను జాబులన్నీ

ఆఫీసులోనే వుంటాయి. మరి నేను ఎదురు చూస్తున్న జాబుతో నాకత్యవసరమైన పనుంది. శ్రమ అనుకోకుండా మీరు దయచేసి..."

"శ్రమ అని మా కర్తవ్యాన్ని నిర్వహించకుండా ఊరుకునే అలవాటు మాకు లేదండీ! ఐతే తమకు జాబులు వెదికి యివ్వవలసిన కర్తవ్యం మాదికాదు. మీరు పోస్టుమేన్ వచ్చేవరకూ ఆగడం మంచిది" అని ఆనందరావు మళ్ళీ తన పనిలో లీనమైపోయాడు.

తారకరావు అయిదు నిమిషాల వరకూ విగ్రహంలా కిటికీ దగ్గరే నిలబడి వుండి, యిక లాభం లేదనుకుని తలవంచుకుని మెల్లగా అక్కడినుంచీ వెళ్ళిపోయాడు.

"టిట్ ఫార్ టాట్, సరైన శాస్తి చేశాన్లే" అని సంతృప్తి చెందాడు ఆనందరావు.

పదిరోజుల తర్వాత ఒకనాడు ఆనందరావు రైల్వే స్టేషనుకు పోయి రావలసిన పని బడింది. సాయంత్రం నాలుగున్నరగంటల బండికి శ్రీమతి నెల్లూరినుంచి రాబోతున్నదన్న శుభవార్త అతనికి ఆరోజు ఉదయమే అందింది. వార్త అందినప్పటి నుంచీ వాయు వీధుల్లో సంచరింపసాగిన ఆనందరావుకు స్టేషనులో అడుగు పెట్టేంతవరకూ తారకరావు జ్ఞప్తికే రాలేదు.

స్వతహాగా ఆనందరావుది కలహ స్వభావం కాదు, మంచికో చెడ్డకో ప్రారంభమైన స్పర్ధ అంతటితో ఆగిపోతే బాగుండుననుకున్నాడతడు, కానీ పూర్వ వైరం మరింత ఉధృతం అయినట్లు తారకరావు  ఆనందరావుపైన తీక్షవీక్షణాలను ప్రసరింపసాగేడు.

ఎందుకైనా మంచిదని ఆనందరావు ఒక ప్లాటుఫారం టికెట్టు కొనుక్కుని బ్రిడ్జి దగ్గరకు వెళ్ళి రైలుకోసం ఎదురు తెన్నులు చూడసాగేడు. రైలేమో సక్రమంగా నాలుగున్నరకే వచ్చింది. ప్రవాసానంతరం పుష్పకవిమానంనుంచీ దిగిన సీతాదేవిలా శ్రీమతి దరహాసవదనంతో ప్లాటుఫారంపైన కాలుబెట్టింది. ఆమెగారు వెంట తెచ్చిన ట్రంకుల్ని, లెదరుబ్యాగుల్ని జాగ్రత్తగా క్రిందికి దింపి, ఆనందరావు "టికెట్టు భద్రంగా వుందికదా!" అని భార్యని హెచ్చరించుకున్నాడు.

'టికెట్టు' అన్న మాట చెవినిబడగానే శ్రీమతి ముఖంలో వెలుగు కాస్తా మాయమైపోయింది. ఆమె చేతవున్న పుస్తకాన్ని విదిలించి విదిలించీ చూచుకుంది. తొందరగా పెట్టె తెరచి చీరల మడతలన్నీ గాలించింది. లెదరుబ్యాగు తెరచి అందులోవున్న పుస్తకాలన్నింటినీ ప్లాటుఫారంపైన క్రుమ్మరించింది. కానీ టికెట్టు మాత్రం ఎక్కడా కనిపించలేదు!

టికెట్టుకోసం శ్రీమతి అన్వేషణ కొనసాగుతూ వుండగానే 'టికెట్, టికెట్' అంటూ తారకరావు అక్కడికి వచ్చేశాడు!

ఆనందరావు అధోముఖుడై 'టికెట్టు లేదు. ఎక్కడో పడిపోయింది' అన్నాడు.

"జారిపడిపోయిందని మాకు నమ్మకం ఏమిటి? మీరు టిక్కెట్టు లేకనే ప్రయాణం చేసివుండవచ్చు" అన్నాడు తారకరావు.

"ఇంతకూ మీరనేదేమిటి?" అన్నాడు ఆనందరావు, శిక్షను ధైర్యంగా ఎదుర్కోవడానికి సంసిద్ధుడైన నేరస్థుడిలా.

ఇన్స్పెక్టరు జావర్ లా సీరియస్‌గా "పెనాల్టీ చెల్లించాలి. ఎక్కడనుంచీ వస్తున్నారు?" అని ప్రశ్నిస్తూ తారకరావు రసీదు పుస్తకం చేతికి తీసుకున్నాడు.

"నెల్లూరునుంచీ" అంటూ ఆనందరావు జేబులో చేయివేశాడు.

తారకరావు కాగితంపైన ఏదో లెక్క వేసి "ఆరు రూపాయలా పన్నెండు అణాలు' అన్నాడు!

ఆనందరావు ముఖం వెలవెలపోయింది. అతడి జేబులో అంత డబ్బు లేదు. ఐనా అతడు తారకరావుని బ్రతిమాలుకోవాలనుకోలేదు.

"నువ్విక్కడే ఆ చెట్టు క్రింద కూచుని వుండు, నేనిప్పుడే వస్తాను ఊళ్ళోకి వెళ్ళి" అని భార్యతో చెప్పి అతడు తారకరావంటూ ఒక వ్యక్తి అక్కడున్న విషయాన్ని మరచిపోయినట్టు తిన్నగా ఊళ్ళోకి దారితీశాడు.

ఆనందరావు స్టేషనుకు తిరిగి వచ్చేసరికి అయిదున్నర దాటింది. అతడు సరాసరి బుకింగ్ రూంలోకి వెళ్ళి డబ్బును టేబిల్‌పైన కుప్పబోసి "రసీదు యివ్వండి" అన్నాడు.

"మన్నించాలి ఆనందరావుగారూ మీకు శ్రమ కలిగించినందుకు. మీరు వెళ్ళిపోయిన తర్వాత టిక్కెట్టు దొరికింది!" అన్నాడు తారకరావు.

ఆనందరావు డబ్బు చేతిలోకి తీసుకుని వెనుదిరిగి వెళ్ళిపోబోతుండగా మళ్ళీ తారకరావే ప్రారంభించాడు. "ఆనందరావుగారూ! ఇప్పటికే ఊళ్ళోకి స్టేషనుకు రెండు మూడుసార్లు తిరిగారు. ఈ రాత్రికి మా యింట్లో ఆతిథ్యాన్ని తీసుకోగూడదూ దయచేసి!"

ఆనందరావుకు ఒళ్ళు చరాలుమన్నది. అతడు "థేంక్స్. మీ ఆతిథ్యాన్ని నిరాకరింపవలసి వచ్చినందుకు చింతిస్తున్నాను. సెలవ్" అంటూ బయటికి వచ్చి శ్రీమతికోసం ప్లాటుఫారమంతా కలయజూచాడు. ఒకటి రెండుసార్లు ఈ చివరినుంచీ ఆ చివరకు తిరిగాడు. వెయిటింగ్ రూంలోకూడా చూచాడు. కానీ శ్రీమతి ఏదీ! ఇట్టే సాక్షాత్కరించి అట్టే మాయమైపోయిందే!

ఇంతలో తారకరావు బుకింగ్ రూంనుంచీ బయటికి వచ్చి "ఆనందరావుగారూ మీ ఆవిడకోసం వెదుకుతున్నట్టున్నారు! అదిగో, ఆమె ఆ ఇంట్లోకి వెళ్ళడం మాత్రం చూచాను. మళ్ళీ అక్కడినుంచీ రాలేదు. బహుశా అక్కడే వుండవచ్చు" అన్నాడు.

ఆనందరావు మళ్ళీ ఒక 'థేంక్స్'ను తారకరావుముఖాన విసిరికొట్టి అతడు చూపించిన ఇంటి ముందరికి పోయి నిలబడ్డాడు. ఇంట్లో నుంచీ నవ్వులు, మాటలు, చప్పట్లు జోరుగా వినిపిస్తున్నాయి. "మహా రాచకార్యం వెలగబెడుతున్నావులే" అని మనసులో అనుకుని ఆనందరావు "శ్రీమతీ! శ్రీమతీ!" అని భార్యని పిలిచాడు.

"అక్కడే నిలబడిపోయారెందుకు? లోపలికి రండి" అంటూ శ్రీమతి బయటికి వచ్చి "మీరు దీన్నెరుగరుకదండీ! ఇదే మా సత్యవతి" అంటూ తన నేస్తాన్ని ఆనందరావుకు పరిచయం చేసింది.

ఆనందరావు వరండాలో వున్న కుర్చీమీద కూలబడుతూ "మీ వారిక్కడ ఏం చేస్తున్నారమ్మా" అని సత్యవతిని ప్రశ్నించాడు.

"మీకు తెలియదేమండీ" మావారిక్కడ బుకింగ్ క్లర్కుగా వుంటున్నారు" అన్నది సత్యవతి.

'హతోస్మి! హతోస్మి!' అనుకున్నాడు ఆనందరావు.

"ఈ రాత్రికిక్కడే వుండిపోవాలని బలవంతం చేస్తోందండీ సత్యవతి" అని, ఆనందరావు అభిప్రాయానికి ఎదురుచూడకుండా "లేక లేక నాలుగేళ్ళకు కలుసుకున్నాం మనకు దాని చేతుల మీదుగా విందు పెట్టాలనుందటండీ!" అన్నది శ్రీమతి.

ఈసారి, ఆతిథ్యాన్ని నిరాకరించే సాహసం ఎంత ప్రయత్నించినా ఆనందరావుకు కలుగలేదు.

ఆ రాత్రిపూట రైల్వే క్వార్టర్సులో పోస్టల్ క్లర్కు ఆనందరావు, రైల్వే బుకింగ్ క్లర్కు తారకరావు ప్రక్కన కూచుని విస్తరిలోని పిండివంటల్ని మాయం చేస్తూ సత్యవతమ్మ చేతి పాకాన్ని నలపాకమనీ, భీమపాకమనీ మనస్ఫూర్తిగా మెచ్చుకున్నాడు.

♦ *ఆంధ్ర సచిత్ర వారపత్రిక* – *1955* ♦